క్లుప్తంగా

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మిసీతారామయ్య, వలంటీరు శివలక్ష్మి

పరవాడ: వలంటీర్లు ఆదివారం తెల్లవారక ముందే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. నాయుడుపాలెంలో సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి సోమవారం అందించనున్నట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణ్ చెప్పారు.

ఉక్కు పరిరక్షణకు పోరాటం

పరవాడ: కూర్మన్నపాలెం కూడలిలో ఈ నెల 5న సాయంత్రం నిర్వహించనున్న చలో స్టీల్ ప్లాంటు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన పరవాడలో ఆదివారం గోడపత్రిక విడుదల చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న మణిహారం విశాఖ స్టీల్‌ప్లాంటు లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. 25 వేల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించిందన్నారు. ఈ బంగారు బాతును కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ఉద్యమించాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వి.వి.రమణ, ఎ.నాగేశ్వరరావు, ఎం.బంగార్రాజు, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎవరి పనుల్లో వారు ఉండాలని, ఎక్కడ పనిచేస్తున్నారో వివరాలు తెలియపరచాలన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

మంచిగా మెలగండి

ఫోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి గొడవలు చేయకుండా బుద్ధిగా మెలగాలని సూచించారు. మద్యం తాగి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు ప్రతి రోజు ఎక్కడికి వెళ్లినా.. సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల విద్యార్థిని అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చిత్తూరు హనీషా అనే బాలిక వన్‌టౌన్ ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో సోదరుడు ఆమెను కాలేజీ వద్ద డ్రాప్ చేశాడు. కాలేజీ వదిలే సమయం సాయంత్రం సుమారు 4.30 గంటలకు అక్కడికి వచ్చి వేచి ఉండగా.. ఎంతసేపటికి సోదరి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం హనీషా తల్లి చిత్తూరు లక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

స్వచ్ఛతపై అవగాహన కల్పించడానికి ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరిసరాలతో పాటు కార్యాలయాలు, పలు కూడళ్లలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. హోదాలను పక్కన పెట్టి చీపుర్లు చేతపట్టారు. చెత్తాచెదారాలు స్వయంగా తొలగించి పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు.

జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి,ఎంపీపీ సూర్య కుమారి



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో నిర్వహించిన మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు



పద్మావతి నగర్‌లో శ్రమదానం చేస్తున్న జెడ్పీ మల్లయ్యనాయుడు

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత కావాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని సబ్బవరం, మొగలిపురం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. సబ్బవరంలో విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుకుందామని, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అని నినాదాలు చేశారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారికి ఇరువైపులా చెత్తాచెదారాలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. మొగలిపురంలో ముందుగా ఆయన విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు,అధికారులతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి శ్రమదానం ద్వారా చెత్త తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం, ఎంపీడీవో రమేష్ నాయుడు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాద్, వైఎస్సార్సీపీ నాయకులు బోకం రామునాయుడు, ఐడీ బాబు, యడ్ల నాయుడు, ఈవోఆర్డీ మహేష్, సబ్బవరం సచివాలయ ఉద్యోగి మూర్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

చీపుర్లు పట్టి..

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పద్మావతినగర్‌లో ఏక్ తారీక్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులతో కలిసి జెడ్పీ శ్రమదానం చేశారు. చెత్తాచెదారాలను తొలగించారు. రోడ్లు శుభ్రం చేశారు. ఏఎంహెచ్‌వో రాజు, శానిటరీ సూపర్‌వైజర్ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వామి, పద్మావతినగర్ అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యుడు రవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

- ఏక్ తారీక్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమాన్ని 97వవార్డు సీ–1 జోన్ పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీవీఎంసీ వార్డు సిబ్బంది, కాలనీ నిర్వాసితులతో కలిసి పార్కులో ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.
- జీవీఎంసీ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం, గొల్లవిల్లిపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు జీవీఎంసీ సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మి, ప్రసన్నలక్ష్మి, శేఖర్, రాజు, ఆర్పీ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.
- పెందుర్తి నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి నుంచి శివాలయం వరకు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కాళ్ల జగన్‌మోహన్, ఎర్ర అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హీ సేవా

పరవాడ: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిక్కవానిపాలెం సముద్ర తీరంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు తీరంలో చెత్త, ప్లాస్టిక్ కవర్లు, రాపర్స్, గాజు ముక్కలు సేకరించి తొలగించారు. సర్పంచ్ చేపల మసేను, గ్రామ ప్రజలు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

- సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో తిక్కవానిపాలెం తీరంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా ప్రారంభించారు. ఉద్యోగులు తీరంలో చెత్త, ప్లాస్టిక్, కాగితాలను సేకరించారు. కార్యక్రమంలో దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా, సీజీఎం గోవిందరాజన్, సంస్థ జీఎంలు, ఉన్నతాధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.
- ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు పవర్‌గ్రిడ్ సీనియర్ డిప్యూటీ మేనేజర్ కె.చంద్రసేన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసరాల్లో చెత్త సేకరించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో హెచ్ఆర్ సూపర్‌వైజర్ గౌరీ శంకర్రావు, జూనియర్ ఇంజినీర్లు రమణ రాజు, సురేష్, పైల అప్పారావు, శ్రీనుబాబు, రామ్‌కుమార్, సౌమ్యరంజన్ పాల్గొన్నారు.



సుజాతనగర్ సీ-1 జోన్ పార్కులో శ్రమదానం చేస్తున్న నాయకులు



తిక్కవానిపాలెం తీరంలో శుభ్రం చేస్తున్న రాంకీ ప్రతినిధి బృందం



95వ వార్డులో రోడ్లు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు



తీరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఉద్యోగులు

స్నేహితుల ఔదార్యం



స్నేహితుడికి నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న నునపర్తికి చెందిన పెదపూడి తాతాజీ రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు కాలువలో పడిపోవడంతో కాలు విరిగిపోయి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థి తాతాజీని ఆదుకోవడానికి స్నేహితులు ముందుకు వచ్చారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు, కొంత నగదును ఆదివారం స్నేహితుడు తాతాజీకి అందజేశారు. తమ వెల్ఫేర్ గ్రూపు ద్వారా తోటి స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకోవాలని నిర్ణయించామని పూర్వ విద్యార్థి కన్నూరు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో బండారు ముత్యాలనాయుడు, కండిపల్లి నేస్తాలు, ఎం.మారునాయుడు, బి.బాబూరావు, అక్కమ్మ, కె.దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం భాద్రపద మాస శుద్ధ విదియ ఆదివారాన్ని పురస్కరించు కుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 దర్శనాలు కల్పించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

రహదారి మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: ఎన్టీపీసీ– కలపాక రహదారికి మరమ్మతులు చేపట్టడానికి అధికారులు చర్యలు చేపట్టారు. రహదారి అధ్వానం శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు నిర్మాణం చేపట్టి నెలలు తిరక్కముందే మరమ్మతులకు నోచుకోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించిన కారణంగా రోడ్డు గోతులు మయంగా మారిందని సోమునాయుడుపాలెం, కలపాక, వెన్నలపాలెం గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఆరోపించారు. ఈ తరుణంలో గుంతలు పడిన రహదారి మరమ్మతులు చేపట్టడానికి అధికారులు పనులు ప్రారంభించారు.



ధ్వంసమైన రహదారిలో పనులు చేపడుతున్న దృశ్యం

భారీ అన్నసమారాధన



వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సింహాచలం: జీవీఎంసీ 96వ వార్డు పరిధి దొగ్గానిపాలెం వద్ద మరిడిమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళిపూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

5న చలో స్టీల్‌ప్లాంట్ బహిరంగ సభ

విజయవంతం చేయాలని సీపీఎం నేత లోకనాథం పిలుపు



బైక్ ర్యాలీతో సింహాచలం చేరుకున్న సీపీఎం నాయకులు, ఉక్కు ఉద్యోగులు

సింహాచలం: విశాఖ ఉక్కు పరిరక్షణకై ఈనెల 5న చలో స్టీల్‌ప్లాంట్ పేరిట జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు చేపట్టిన ఉత్తరాంధ్ర బైక్ యాత్ర ఆదివారం సింహాచలం చేరుకుంది. అడవివరంలోని ప్రధాన కూడలిలో లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, ప్రాణత్యాగాలతో ఏర్పాటు చేసుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా ప్రతీ ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ బంగారుబాతు అని, అలాంటి బంగారు బాతుని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు పూనుకుందన్నారు. బీజేపీ విధానాన్ని ప్రతీ ఒక్కరూ తిప్పి కొట్టాలన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఈనెల 5 సాయంత్రం 5గంటలకు స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.జగన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.ప్రభావతి, గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకట్రావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సంఘం నాయకుడు టి.వి.కృష్ణంరాజు, 98వవార్డు నాయకుడు ముద్దాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు పూయించిన కామెడీ షో



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ హ్యూమర్ క్లబ్ సభ్యులు, క్రియేటివ్ కామెడీ క్లబ్ సభ్యులు, విశాఖ రత్న కామెడీ, హాస్య ప్రియ, హాస్య దర్బారు క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వించారు. వీటిలో లాయర్ పరాంకుశం, బట్టల షాపు, పేకాట రాదన్నావు, కవితల ఆవిష్కరణ, మూడు మాత్రలు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. కళాకారులు జబర్దస్త్ ప్రకాశ్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, డేవిడ్‌రాజు, రావి గోపీకృష్ణ, శివజ్యోతి, నాయుడు, పుష్పమి, అనూరాధ, కుమారి, పోర్టు శేషు, శ్రీధర్ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పూయించాయి. అనంతరం యువ నాటకోత్సవాల్లో ముళ్లతీగలు, ఇంతింతే నాటకాలు ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాయుడు

మురళీనగర్: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుందామంటూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ప్రెసిడెంట్ డాక్టర్ డి.డి.నాయుడు పిలుపునిచ్చారు. మురళీనగర్ జయరామ ఫంక్షన్ హాల్లో స్థానిక వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ ఆధ్వర్యంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అధ్యక్షతన ఆదివారం డిస్ట్రిక్ట్–101 నాలుగో క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. విశాఖ ఉమ్మడి జిల్లాలు, శ్రీకాకుళం, విజయనగరం ఉమ్మడి జిల్లాల నుంచి వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులు, మహిళా వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రజల్లో నిరంతరం ఆరోగ్య స్పృహను కల్పించడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తారన్నారు. శుభ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు వారి ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలియజేశారు. ఎంజీఎఫ్ సభ్యులు, పూర్వ క్లబ్ అధ్యక్షులు, పూర్వ గవర్నర్లు, ఇతర పెద్దలను ఘనంగా సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సేలం ఐజక్, అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, ఇమ్మీడియట్ ఫాస్ట్ గవర్నర్ వాకర్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ఏఎహెచ్ఎస్ వెంకటరావు, ఎ.లక్ష్మీరెడ్డి, ఎలెక్ట్ గవర్నర్ టి.రంగారావు, క్యాబినెట్ సెక్రటరీ సిహెచ్.జ్యోతి, కోశాధికారి మహాలక్ష్మి, బులిటెన్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి, క్యాబినెట్ ఉప కార్యదర్శి జయ, సిహెచ్.అప్పారావు, వై.వి.అప్పారావు, ఎస్.రోజారాణి, కోశాధికారి జి.షీలారాణి పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు పారదోలాలి



జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డిని సత్కరిస్తున్న ఆర్ఎంపీ వైద్యులు

మహారాణిపేట : గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో సరైన వైద్యం చేయించుకోక మరణాలు సంభవిస్తున్నాయని, ఆర్ఎంపీ వైద్యులు దీనికి అడ్డుకట్ట వేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. రామ్‌నగర్‌లోని జేవీవీ నాయకుడు సోమేష్ మాస్టారు స్వగృహానికి విచ్చేసిన ఆయనను ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో పలువురు ఆర్ఎంపీ వైద్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ అమాయక ప్రజల మూఢ నమ్మకాలను పారద్రోలడంతో పాటు డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజా వైద్యునిగా కూడా గుర్తింపు పొందారని ప్రశంసించారు. విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటరావు, మురళి, చిరంజీవి, భాస్కరరావు, జేవీవీ నాయకులు గోపాల్ నాయక్, బాషా, స్వామి నాయుడు, యోహాను పాల్గొన్నారు.

అద్భుతం చైతన్య దీపిక కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్య ప్రదర్శనలో దీపిక

మద్దిలపాలెం : సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్న వేద చైతన్య దీపిక తన కూచిపూడి నృత్యంతో అబ్బురపరిచారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఆదివారం అరంగేట్రంలో దీపిక తన నాట్య విన్యాసంతో ఆకట్టుకుంది. వెంపటి చినసత్యం ప్రియ శిష్యుడు గురు శ్రీహరి రామమూర్తి ఆశీస్సులతో నేమాని విశ్వశాంతి మార్గదర్శకత్వంలో అరంగేట్రం వైభవంగా జరిగింది. స్టార్‌మేకర్ లంక సత్యానంద్, విజయకుమార్.. చైతన్య దీపికను ఆశీర్వదించారు. అనంతరం సుమారు రెండు గంటల పాటు నిర్విరామంగా చైతన్య దీపిక కూచిపూడి నాట్యంతో మంత్ర ముగ్ధులను చేసింది.

షాడోగ్రఫీపై పిల్లలకు శిక్షణ



వర్చువల్ సెషన్ ద్వారా పిల్లలకు షాడోగ్రఫీలో టెక్నిక్స్ నేర్పుతున్న రేఖావ్యాస్

సీతంపేట: ముంబైకి చెందిన షాడో గ్రాఫిస్ట్ రేఖా వ్యాస్ వర్చువల్ సెషన్ ద్వారా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీలో పిల్లలకు హ్యాండ్ షాడోగ్రఫీని నేర్పించారు. చాలా మందికి కథలు చదవడం, వినడం ఇష్టపడతారని, పప్పెట్ షో, షాడోగ్రఫీతో కథలు చెప్పినపుడు ఆనందం రెట్టింపవుతుందని ఆమె అన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు పిల్లల్లో వినోదం, సృజనాత్మకత కల్పనను రేకెత్తిస్తాయని, పఠనాశక్తిని, పుస్తకాలపై ప్రేమను కలిగిస్తాయన్నారు. రేఖా వ్యాస్ ఇంటరాక్షన్ విద్యార్థులను ఎంతగానో ఆకర్షించి షాడోగ్రఫీలో లీనమయ్యేలా చేసింది. షాడోగ్రఫీతో ఎలా కథలు చెప్పాలి, దానికి సంబంధించిన ఉపాయాలు, టెక్నిక్స్, కొన్ని రకాల హ్యాండ్ షాడోలు ఎలా తయారు చేయాలో పిల్లలకు నేర్పించారు.